



మందమర్రిలో ప్రచారం చేస్తున్న కళాకారులు

# మందమర్రిలో బీఆర్ఎస్ కళాజాత ఎన్నికల ప్రచారం

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కళాకారులు

మందమర్రి, అక్టోబర్ 25 : ఎన్నికల నేపథ్యంలో మందమర్రి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కళాజాత కళాకారులు తమ గేయాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ఆయా వార్డుల్లో తిరుగుతూ జనకూడలి ప్రదేశాల్లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోలోని హామీలను తమ గేయాల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఫిల్టర్ బెడ్ ఏరియా, ప్రాణహిత కాలనీల్లో బుధవారం ప్రచారం చేశారు. ప్రచార వాహనం వద్దకు చేరుకుంటున్న ప్రజలు కళాకారుల ఆటపాటలను తిలకిస్తున్నారు. మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా అమలు చేస్తున్న పథకాలతో పాటు చెన్నూర్ నియోజకవర్గంలో విప్ బాల్క సుమన్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసి బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ప్రభుత్వ పథకాలపై కళాకారుల ఆటపాటలను తిలకిస్తున్న ప్రజలు

# బస్తా యూరియా.. అర లీటర్ బాటిల్‌లో

- ఇక నుంచి నానో యూరియా లభ్యం
- తయారు చేసిన ఇఫ్కో సంస్థ
- వాడకంపై రైతులకు అవగాహన
- తగ్గనున్న పెట్టుబడి.. పెరగనున్న దిగుబడి



పారుపల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, ఏఈవో

కోటపల్లి, అక్టోబర్ 25 : యూరియా అనగానే బస్తాలో తెల్లటి గుళికలు గుర్తుకొస్తాయి. అలాంటి 45 కిలోల యూరియా.. ఇక నుంచి అర లీటర్ బాటిల్‌లో లభ్యం కానున్నది. అర లీటర్ బాటిల్‌లో లభ్యమయ్యేలా ఇఫ్కో సంస్థ నానో యూరియా తయారు చేయగా, వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెరుగుతుండగా, రైతులపై అధిక భారం పడుతున్నది. దిగుబడులు సైతం ఆశించినంత రాకపోతుండడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఇఫ్కో.. నానో బయో టెక్నాలజీ పరిశోధనా సంస్థ ద్రవరూపంలో ఉండే నానో యూరియా తయారు చేసింది.

### అన్ని పంటలకు అనుకూలం..

నానో యూరియా అన్ని పంటలకు అనుకూలం. కాగా రైతులు వర్షాభావ పరిస్థితుల్లో ఈ యూరియానే వాడాలని సూచిస్తున్నారు. పర్యావరణానికి ఎలాంటి హానీ తలపెట్టకుండా పంట ఉత్పత్తుల పెరుగుదలకు కూడా దోహదపడుతుంది. దీంతో రైతులు ఎక్కువగా నానో వైపు మొగ్గు చూపుతున్నారు. తెల్లటి గులికలు ఉన్న యూరియా బస్తాను పొలాల వెంట తీసుకెళ్లడం కష్టం. కానీ, ఈ నానో యూరియాను సులభంగా ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లి, పిచికారీ చేసే అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు రవాణా, నిల్వ ఖర్చులు తగ్గనున్నాయి.

### పిచికారీ సూచనలు..

నానో యూరియాను ఉపయోగించే ముందు రైతులు బాటిల్‌ను బాగా షేక్ చేయాలి. ఉదయం లేదా సాయంత్రం పిచికారీ చేయాలి. బలమైన సూర్యకాంతి, బలమైన గాలి, పొగ మంచులో ఉపయోగించరాదు. నానో యూరియా పిచికారీ చేసిన 12 గంటల లోగా వర్షం పడితే మళ్లీ పిచికారి చేయాలి.

### నానో వాడకంతో ప్రయోజనం..



*రైతులు పాత పద్ధతిలో యూరియాను వాడకుండా నూతనంగా వచ్చిన నానో యూరియాను వాడడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. ఈ నానో బాటిల్‌ను భద్రపరచడంతో పాటు ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. దీని వాడకం వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ జరుగదు. మొక్కలకు స్ప్రే చేయడం ద్వారా నేరుగా మొక్కకు పోషకాలు అందడంతో పాటు వర్షాభావ పరిస్థితుల్లో మొక్కలకు నీటి లభ్యత పెరగుతుంది. రసాయన ఎరువుల వినియోగం తగ్గిచడం కూడా సాధ్యమవుతుంది. ఈ నానో యూరియా వాడకంపై గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.*

**- టీ మహేందర్, ఏవో, కోటపల్లి**

బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న వేమనపల్లి మండల సీనియర్ నాయకులు



# బీఆర్ఎస్‌లో చేరికలు

వేమనపల్లి, అక్టోబర్ 25 : కాంగ్రెస్ పార్టీ నీల్వాయి మాజీ ఎంపీటీసీ సీపెల్లి అంకులు, కల్మలపేట వార్డు సభ్యులు, ఎంఆర్‌పీఎస్ మాజీ మండలాధ్యక్షుడు సీపెల్లి శ్రీనివాస్, నఫీజాబేగం, హమీద్‌ఖాన్, మల్లేశ్ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ రుద్రభట్ల లక్ష్మీనారాయణ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోలి వేణుమాధవ్ మండలంలో అందిస్తున్న సేవలను చూసి పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నన్న, నరేందర్‌రెడ్డి, బుచ్చుమేర, ఒల్లేశ్, మల్లేశ్, వెంకటేశ్, కుమార్ పాల్గొన్నారు.

# నల్లపోచమ్మ తల్లి రాతి విగ్రహం లభ్యం

- విజయదశమి రోజున లభించడంతో కాలనీవాసుల హర్షం
- ఊర పోచమ్మ, మదన పోచమ్మ ఆలయంలో ప్రతిష్టించిన భక్తులు

మందమర్రి, అక్టోబర్ 25 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో గల బతుకమ్మ మైదానం వద్ద పోచమ్మ తల్లి రాతి విగ్రహం లభ్యమైంది. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయదశమి వేడుకల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కాలనీ సమీపంలోని కూడలి వద్ద కాలనీవాసులు శమీ( జమ్మి) పూజ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో కాలనీకి చెందిన నల్లగొండ రమేశ్‌కు పూనకం వచ్చింది. సమీపంలో అమ్మవారి విగ్రహం ఉన్నదని ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నాడు. రమేశ్ పూనకంలో ఉండగానే విగ్రహం ఎక్కడ ఉందో చూపిస్తే తప్పకుండా పూజిస్తామని కాలనీవాసులు అనడంతో సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్నదని చెప్పాడు. దీంతో కాలనీవాసుల ఆ ప్రదేశంలో తవ్వగా, అరమీటరు లోతులోనే విగ్రహం లభించింది. అనంతరం కాలనీవాసులు విగ్రహాన్ని నల్ల పోచమ్మ తల్లిగా భావించి, కాలనీలోని ఊర పోచమ్మ, మదన పోచమ్మ ఆలయంలో ప్రతిష్టించి పూజలు చేశారు. విజయదశమి రోజున విగ్రహం లభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయం నిర్మాణ దశలో ఉండడంతో పూర్తయిన వెంటనే జాతర వేడుకలు నిర్వహిస్తామని కాలనీవాసులు తెలిపారు.



కాలనీలో లభ్యమైన విగ్రహాన్ని అలంకరిస్తున్న భక్తుడు

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్, కళాజాత బృందం సభ్యులు

కోటపల్లి, అక్టోబర్ 25 : కోటపల్లి మండలం నాగంపేట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కోటపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కళాజాత వారితో బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ ద్వారా రైతులు, మహిళా సంఘాలు, గృహ నిర్మాణాలకు అందిస్తున్న రుణాలు, సామాజిక భద్రత, ప్రధానమంత్రి సురక్షా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, అటల్ పింఛన్ యోజన, నగదు రహిత లావాదేవీలపై పాటలు, మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం వివరాలు, ఓటీపీలు చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ టీ ఉదయ్ కుమార్, కళాజాత బృందం సభ్యులు చిరంజీవి, మెజీషియన్ విష్ణు, ఖాతాదారులు, రైతులు, పొదుపు సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.